సీరియల్

రాక్షసవేటు

వాణిశ్రీ

(గత సంచిక తరువాయి)

"మీట్ మై ఫ్రెండ్ మిష్టర్ శ్రీనాథ్."

"హాయ్ ఈజ్ వెంకటసుబ్బయ్య, మేనేజర్, ప్రసాద్ ఇండస్ట్రీస్."

పరిచయం చేశాడు కిరణ్.

ఇద్దరూ షేక్‌హేండ్స్ ఇచ్చుకున్నారు.

ముగ్గురూ బార్‌లోకి వెళ్ళారు.

"ఏరా మందు పుచ్చుకుంటావా?" అడిగాడు కిరణ్.

"నీ దయవల్ల ఇంకా మొదలు పెట్టలేదు" అన్నాడు శ్రీనాథ్ నవ్వుతూ.

"వెధవా! అమెరికాలో ఉండేవాడివి మందు కొట్టడం మొదలుపెట్టలేదా! షేమ్!.....షేమ్.....!" అన్నాడు కిరణ్.

శ్రీనాథ్ బిత్తరపోయాడు.

"ఆఁ...." అన్నాడు.

కిరణ్ కన్ను గీటాడు.

"అమెరికాలో వున్నంత మాత్రాన తాగుడు నేర్చుకోవాలని ఎక్కడుందిలే!" అన్నాడు వెంకటసుబ్బయ్య.

"యూ ఆర్ కరెక్ట్ సార్!" అన్నాడు శ్రీనాథ్.

"మీరు అమెరికాలో వుంటారా?" అడిగాడు వెంకట

సుబ్బయ్య శ్రీనాథ్ ని.

"అవున్సార్! వాడు ఇంజనీరు. ఈమధ్యనే వచ్చాడు ఇండియాకి. పెళ్ళి చేసుకుని వైఫ్ తో సహా వెళ్ళిపోతాడు. కదరా!" అన్నాడు కిరణ్.

కిరణ్ చెప్తున్న పచ్చి అబద్ధాలకు విస్తుపోతున్న శ్రీనాథ్ తేరుకుని "అవునవును...." అన్నాడు.

"వీడి అంకుల్ యెప్పుడో పాతికేళ్ళ క్రితమే సెటిల్ అయిపోయాడు అమెరికాలో. ఆయన పేరు వీరన్న. అయితే వీరేన్ అంటూంటారు ఫ్రెండ్స్. పెద్ద స్కాలర్ లెండి ఆయన. విస్కాన్సిన్ యూనివర్సిటీలో ఎం.ఇ, డిగ్రీ తీసుకున్నాడు. హైడ్రాలజీలో పి.హెచ్.డి. చేశాడు. ఆయన ఇంటలిజెన్స్ చూసి అమెరికావాళ్ళు ఆశ్చర్యపోయారనుకోండి. అక్కడే ఓహియో నార్దర్న్ యూనివర్సిటీలో సివిల్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ గా చేరిపోయాడు. ప్రస్తుతం న్యూమెక్సికో యూనివర్సిటీలో ప్రొఫెసర్ గా పనిచేస్తున్నారు. మనవాడు కూడా అక్కడే యమ్.ఇ., మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తిచేశాడు."

ఈ కుర్రాడు అమెరికాలో ఎమ్.ఇ., చదివాడా అని వెంకటసుబ్బయ్య ఆశ్చర్యంగా శ్రీనాథ్ ని చూస్తున్నాడు.

కిరణ్ యూనివర్సిటీ పేర్లతో సహా చెప్తూ సారకాయలు కోస్తుంటే బిత్తరపోతున్నాడు శ్రీనాథ్.

వెయిటరు ఆర్డర్ కోసం వెయిట్ చేస్తున్నాడు.

"యం సి. విస్కీ క్వార్టర్, రెండు యాపిల్ జ్యూస్" చెప్పాడు కిరణ్.

వెంకటసుబ్బయ్య క్వార్టర్ విస్కీ తాగేసి కూర్చు

న్నాడు. కిరణ్ మరొక క్వార్టర్ తెప్పించాడు.

"కిరణ్! నిన్ను చూస్తే భలే గమ్మత్తుగా వుంటుందయ్యా! నీ నెలజీతం ఒక్కరోజులో ఇలా తగలేస్తావు! మరి నెలంతా ఎట్లా నెట్టుకొస్తావో యేమోగాని, అసలు నువ్వు ఉద్యోగం ఎందుకు చేస్తున్నావా అని?" అన్నాడు వెంకటసుబ్బయ్య.

"మీలాంటి పెద్దవారిని ప్రసన్నం చేసుకుంటే ముందు ముందు పెద్ద వుద్యోగం దొరక్కుండా పోదా? అని నమ్మకం. ఇక డబ్బుదేముంది? ఏదో అత్తగారిచ్చిన కట్నం మీద వడ్డీ వస్తున్నది" అన్నాడు కిరణ్ నవ్వుతూ.

శ్రీనాథ్‌కు పరిస్థితి అర్థం కావడంలేదు.

ఈ ముసలాయన ముందు తనను అమెరికాలో ఇంజనీర్ అని పొగడ్డం ఎందుకు?

ఈయన చేతిలో యేవుంది?

అనవసరంగా కిరణ్ ఆయన్ని కా....కా....పడతాడా?

ఏదో లాభం వుంది. అదేమిటో శ్రీనాథ్ బుర్రకి తట్టడంలేదు.

"మన ప్రొప్రయిటర్‌గారి అమ్మాయికి సంబంధాలు చూస్తున్నారటగా? యేం సార్?" అన్నాడు కిరణ్.

"అవును. దశరథ్ చెప్పాడు."

"ఆ అమ్మాయి పేరు మీకు తెలుసా?"

"అయ్యో! ఎందుకు తెలీదూ? చిన్నప్పటి నుంచి తెలుసు. మా అమ్మాయితో పాటు తిరిగేది. నన్ను అంకుల్ ....అంకుల్ అంటూ చాలా గొప్పగా పిలుస్తుంది. ఆ అమ్మాయి పేరు వందిత" అన్నాడు వెంకటసుబ్బయ్య.

"ఇంజనీరింగ్ చదివింది అనుకుంటాను."

"అవును."

"మా వాడికి ఆ మాచ్ చూడకూడదూ?" అన్నాడు కిరణ్.

శ్రీనాథ్ అయోమయంలో పడిపోయాడు. ఏదో చిన్న అబద్ధంతో బిజినెస్ పెట్టొచ్చు అనుకుంటుంటే వీడు యేకంగా పెళ్ళి సంబంధమే మాట్లాడేస్తున్నాడే అని భయపడిపోతున్నాడు.

"చూడొచ్చు! కాని మీవాడు ఎంతలో వున్నాడో? ఆ ప్రసాద్ పీనాసిరకం. కుదురుతుందా అని" అన్నాడు వెంకటసుబ్బయ్య.

"ఏ విషయం గురించి?"

"పెళ్ళి సంబంధంలో యింకా దేన్ని గురించి వుంటుందయ్యా! అదే కట్నం విషయం. అమెరికాలో ఇంజనీరింగ్ చదివి వచ్చాడంటే అదీ మీ కులంలో ఏ పాతిక లక్షలో కట్నం డిమాండ్ చేస్తారు."

"నో....నో....మా వాడు అటువంటివాడు కాదులెండి. కాకపోతే మావాడి బిజినెస్‌కి పెట్టుబడి పెడితే చాలు. ఏరా?" అన్నాడు కిరణ్.

"ఆఁ ...అవునవును " అన్నాడు శ్రీనాథ్ ఏమని చెప్పాలో తోచక.

"మనవాడు పెళ్ళికాగానే న్యూమెక్సికో వెళ్ళిపోతాడు. పదిలక్షలు ఇస్తే చాలు. అమెరికాలో మనం టెన్ పర్సెంట్ కాపిటల్ పెడితే నైంటీ పర్సెంట్ షెడ్యూల్ బాంక్ అప్పు ఇస్తుంది. సో వన్ క్రోర్‌తో అక్కడ ఇండస్ట్రీ స్టార్టు చేస్తాను" చెప్పాడు కిషోర్.

"పది లక్షలయితే ఒప్పుకుంటాడేమో? అమెరికా

సంబంధం గదా! ఇద్దరమ్మాయిల్ని ఇండియాలోనే ఇచ్చాడు" అన్నాడు వెంకటసుబ్బయ్య.

"మన ప్రొప్రయిటర్ గారితో మీరు కొంచెం చనువుగా వుంటారు గదా! అందుకని చెపుతున్నాను. అదీ గాక అమ్మాయి ఇంజనీర్ కాబట్టి మా వాడు కన్సెషన్ తో ఒప్పుకుంటాడు."

వెంకటసుబ్బయ్య తల వూపాడు.

"మా వాడు అమెరికాలో బిజినెస్ స్టార్టు చేస్తే మీరు, నేను గూడా ఒకసారి సరదాగా వెళ్ళి చూసొద్దాం" అన్నాడు కిరణ్.

వెంకటసుబ్బయ్య నోరు తెరిచి "యెక్కడికి....?" అన్నాడు.

'ఇంకెక్కడికి అమెరికాకే" అన్నాడు కిరణ్ నవ్వుతూ.

"అమెరికా వెళ్ళడం మన జాతకంలో వుందంటావా?" అన్నాడు వెంకటసుబ్బయ్య ఆశగా.

"మీ రీ పెళ్ళి కుదర్చండి. తెలుస్తుంది" అన్నాడు కిరణ్.

28

స్కై బ్లూ ఫియట్ కారులో కూర్చుని శ్రీనాథ్ కోసం కబురు చేశాడు కిరణ్.

మహాలింగపురంలో చిన్న ఔట్ హౌస్ లో అద్దెకుంటున్నాడు శ్రీనాథ్. అద్దె నెలకి రెండొందలు.

ఇల్లుగలవారి పనిమనిషి వచ్చి చెప్పింది మీ కోసం యెవరో కారులో వచ్చారని. తన కోసం కారులో వచ్చినవా రెవరా...? అని ఆలోచిస్తూ వచ్చాడు శ్రీనాథ్.

"ఒకేయ్!....త్వరగా ...రా పోదాం" అన్నాడు కిరణ్ కారులో కూర్చుని చెయ్యి వూపుతూ.

"నువ్వటా? ...ఎవరో అనుకున్నాను. కారు దిగవా యేమిటి? పద రూమ్‌లోకి" అన్నాడు శ్రీనాథ్.

"రూమ్‌లోకి ఎందుకు? పోదాం పద. తొందరగా డ్రెస్ చేసుకో."

"పొయ్యిమీద 'టీ' పెట్టాను. తాగిపోదాం" అన్నాడు శ్రీనాథ్.

కిరణ్ కారు దిగి రూమ్‌లోకి వెళ్ళాడు.

"ఏం రూమ్‌రా ఇది డర్టీ" అన్నాడు కుర్చీలో కూర్చుని.

"ఏదో లేరా! నిరుద్యోగి ఇంతకంటే మంచిది ఎక్కడ భరించగలడు?" అన్నాడు శ్రీనాథ్.

"నోర్ముయ్! నిరుద్యోగం సంగతి మర్చిపో. నువ్వు కాబోయే ఇండస్ట్రియలిస్టువి. దర్జాగా వుండడం నేర్చుకో. బీద అరుపులు మానెయ్."

"అదిసరే గాని నన్ను ఇలా వుంచదల్చుకోలేదా? ఏం కోతలురా బాబూ! ఇంజనీరింగ్ అమెరికాలో చదివాననీ, మా అంకుల్ ఎవడో ప్రొఫెసర్ అనీ...."

"వెయ్యి అబద్ధాలాడి ఒక పెళ్ళి చెయ్యమన్నారు. హైండిట్."

"మరి ఇంత దారుణంగానా?"

"దారుణం యేముంది? నువ్వు ఇంజనీరింగ్ చదివావా లేదా? అది అమెరికాలో అయినా ఒకటే ఇండియాలో అయినా ఒకటే."

"అది సరే!___...."

"ఏ....త్వరగా లెములు. పోదాం. రేపు మనం

పెళ్ళిచూపులు చూడాలి."

"ఎవర్ని?"

"ఇంకెవర్ని? మా ప్రొప్రయిటర్ కూతుర్ని!"

"అరేయ్ బాబూ! నా కెందుకో భయంగా వుందిరా! ఈ నాటకం ఆడడం నావల్ల కాదు."

"ధైర్యమే ధనలక్ష్మిరా బడుద్దాయ్! నీ కెందుకని నే నున్నానుగా" అన్నాడు కిరణ్.

ఇద్దరూ 'టీ' తీసుకుని బయల్దేరారు.

కిరణ్ సరాసరి మౌంట్ రోడ్డులో వున్న రేమాండ్స్ షోరూమ్ ముందు కారు ఆపాడు.

"పద...." అన్నాడు కిరణ్.

"నే నెందుకూ? నువ్వెళ్ళి కొనుక్కురా!"

"బట్టలు నాక్కాదురా! నీకే"

"నాకా!"

"అవును. ఇలా పిచ్చి పిచ్చి బట్టలు వేసుకుని తిరుగుతుంటే నువ్వు ఇంజనీరింగ్ చదివావని ఎవడూ నమ్మడు. కాబోయే అమ్మాయి.... సారీ.... భార్య కళ్ళు మెరిసి పోయేటట్లు వుండాలి. దిగు.... దిగు...." అని తొందర పెట్టాడు.

అరడజను జతలు ప్యాక్ చేయించి, ఐదు వేలు బిల్లు కట్టాడు. షాపింగ్ చేసి అతనికి కావల్సిన వస్తువులన్నీ కొని వి.ఐ.పి. సూట్ కేస్‌లో సర్ది ఇచ్చాడు.

కారు సునీత ఫ్లాట్స్ పార్కింగ్ ప్లేస్‌లో ఆగింది.

తెల్లటి యూనీఫాంలో వున్న కుర్రాడు కారు దగ్గర కొచ్చి విష్ చేసి డిక్కీ తీసి సూట్ కేస్ అందుకొన్నాడు.

లిఫ్ట్ నాలుగో అంతస్తులో ఆగింది.

ఫ్లాట్ నెంబర్ దెబ్భైఏడు.

అత్యంత ఆధునికంగా వుంది ఫ్లాట్. లేటెస్టు డిజైనులో ఈమధ్యనే కట్టారు.

"ఈ ఫ్లాట్ యెవరిది?" ఆశ్చర్యంగా అడిగాడు శ్రీనాథ్ లోపల వున్న ఫర్నిచర్ చూస్తూ.

రెండు బెడ్ రూమ్స్ యెయిర్ కండిషన్ చేసి వున్నాయి.

"నీదే" అన్నాడు కిరణ్.

"అంటే...."

"అదంతే. అమెరికాలో ఇంజనీరింగ్ చదువుతున్న వాడు ఎంత దర్జాగా వుండాలి?"

"ఈ ఫ్లాట్ కి అద్దె?"

"నెలకి మూడు వేలు."

"మైగాడ్!" అదిరిపడ్డాడు.

"డోంట్ బీ సిల్లీ. ఇక నువ్వు నేలమీద నడిస్తే వూరుకోను. ఎవడికీ అనుమానం రాకుండా బిహేవ్ చెయ్యి. ఎక్కడికెళ్ళినా కారు యూజ్ చెయ్యి. కుర్రాడితో సుప్రియాలో భోజనం తెప్పించుకో. ఏం తోచక పోతే ఏదైనా సినిమా కెళ్ళు. అవసరం అనుకుంటే ఇంటికి ఫోన్ చెయ్యి" చెప్పాడు కిరణ్.

"ఈ కారు కూడా అద్దెదేనా?"

"నో....కొన్నాను నిన్ననే."

"నా దగ్గర లైసెన్స్ లేదుగా!"

"ష్....భయపడకు. డబ్బుండాలే గాని అన్నీ పరిగెత్తుకొస్తాయి" అని ధైర్యం చెప్పాడు కిరణ్.

"ఏమిటో రా నా కొంప ముంచుతావేమో? దడగా వుంది" అన్నాడు శ్రీనాథ్.

"చౌకలో అమెరికా ఇంజనీర్ దొరుకుతున్నాడంటే

ఎగిరి గంతేశాడట రాజేంద్రప్రసాద్. వెంకటసుబ్బయ్య సంబరంగా చెప్పాడు. ఈ మాచ్ జరుగుతుంది. డోంట్ వర్రీ. నందిత బ్యూటీ చూస్తే నువ్వెన్ని అబద్ధాలైనా చెప్పేస్తావ్" అని నవ్వాడు కిరణ్.

శ్రీనాథ్ మాట్లాడలేదు. అతనికి అంతా ఆశ్చర్యంగా వుంది. చిన్న రూమ్‌లో వుండేవాడికి ఒక్కసారిగా ఏ.సి. ఫ్లాట్, కారు, నౌకరు వచ్చేసరికి మతిపోయింది.

"సీ....యూ! విష్ యూ బెస్టాఫ్ లక్" అని వెళ్ళిపోయాడు కిరణ్.

టీపాయ్‌మీద వున్న కారు తాళాలు చేతిలోకి తీసుకుని ఆలోచనల్లోకి జారిపోయాడు శ్రీనాథ్. తనకు తెలియకుండానే రొంపిలోకి దిగుతున్నట్లు యేదో అనుమానం మొలకెత్తుతోంది మనసులో. కిరణ్ తనకోసం ఎందుకు చేస్తున్నాడు ఇదంతా?

ఎంత ఆలోచించినా అతనికి సమాధానం దొరకడంలేదు.

మర్నాడు ఉదయమే కిరణ్, విజయ అతని ఫ్లాట్‌కి వచ్చారు. అప్పుడే టిఫిన్ చేసి అలవాటు ప్రకారం వాంటెడ్ కాలమ్స్ వెతుకుతున్నాడు పేపర్లో.

కిరణ్ భార్యని వెంట తీసుకుని వచ్చేసరికి కంగారు పడ్డాడు.

"ఇంకా రెడీ కాలేదా?" అన్నాడు వస్తూనే కిరణ్.

"ఎక్కడికి?" అన్నాడు శ్రీనాథ్ అయోమయంగా.

"ఇంకెక్కడికి? పెళ్ళి చూపులకి."

శ్రీనాథ్ సిగ్గుపడ్డాడు.

"జస్టేమినిట్..." అని బెడ్‌రూంలోకి వెళ్ళాడు.

పదినిముషాల తర్వాత వచ్చాడు శ్రీనాథ్.

"ఇప్పుడు స్మార్ట్‌గా వున్నావురా!" అని మెచ్చుకున్నాడు కిరణ్.

శ్రీనాథ్ పొడగరి. తెల్లటి రంగు రెడీ మేడ్ బట్టల్లో ట్రిమ్ముగా ముస్తాబయ్యేసరికి అందంగా కనిపిస్తున్నాడు.

ముగ్గురూ కార్లో బయల్దేరారు.

వీళ్ళకోసమే యెదురు చూస్తున్నట్లు పోర్టికోలో నిల్చుని వున్నాడు రాజేంద్రప్రసాద్.

కారు దిగగానే విష్ చేశాడు అందరికీ.

అతన్ని చూడగానే విజయ ముఖం ఎర్రబడింది కోపంతో. బలవంతంగా కోపాన్ని అణచుకుంది.

హాల్లో కూర్చున్నారు ముగ్గురూ. తర్వాత వెంకటసుబ్బయ్య గూడా వచ్చాడు. రాజేంద్రప్రసాద్ బ్రతిమాలినా ఆయన యెదురుగా కూర్చోవడానికి ఒప్పుకోలేదు.

దశరథ్‌ని, అతని భార్య రేవతిని పరిచయం చేశాడు రాజేంద్రప్రసాద్.

రేవతి లోపలకు వెళ్ళి నందితను తీసుకొచ్చి సోఫాలో కూర్చోబెట్టింది.

నందిత "నమస్తే" చెప్పింది.

శ్రీనాథ్ కంగారుగా ప్రతి నమస్కారం చేశాడు. అతన్ని ధైర్యంగా వుండమని కళ్ళతోనే చెప్తున్నాడు కిరణ్. అప్పుడప్పుడు మోచేత్తో పొడవడం, గిల్లటం వంటివి చేస్తున్నాడు.

నందిత చంద్రికంటే పొడుగ్గా వుంది. గుండ్రటిముఖం. ఆ ముఖంలో ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతోంది. ఆమె కళ్ళు సూటిగా చూస్తున్నాయి శ్రీనాథ్‌ని గుచ్చిగుచ్చి.

శ్రీనాథ్ పర్సనాల్టీ అందరికీ నచ్చినట్లే కన్పించింది

కిరణ్ చెప్పినట్లుగా అమెరికా విశేషాలు బట్టీపట్టి అప్ప గించేశాడు శ్రీనాథ్.

శ్రీనాథ్‌కి తల్లిదండ్రులు లేరనీ, బ్రదర్స్‌తో కాంటాక్ట్స్ లేవనీ తెలిసి సంతోషించాడు రాజేంద్ర ప్రసాద్. దశరథ్‌కి కూడా ఈ సంబంధం నచ్చింది. పెళ్ళికాగానే అమెరికా వెళ్ళిపోతున్నందున అతనికి ఇబ్బంది ఏమీ లేదు.

"అమెరికాలో ఏం ప్లాన్ చేస్తున్నారు? ఎంత కావాల్సి వుంటుంది?" అని ఆఖరిగా అడిగాడు రాజేంద్ర ప్రసాద్.

"మినీ జనరేటర్స్ మాన్యుఫాక్చరింగ్ ప్లాన్ చేస్తున్నాను. ఆసియాలో మంచి డిమాండ్ వుంది" చెప్పాడు శ్రీనాథ్.

"గుడ్. మీరు చెప్పింది నిజమే. కరెంట్ కోత రోజురోజుకీ పెరుగుతోంది కూడా."

"మా యూనివర్సిటీ రిసెర్చి సెంటర్‌లో నమూనా తయారుచేశాం. కిరోసిన్‌తో పెద్ద శబ్దం లేకుండా స్మూత్‌గా నడుస్తుంది. లో కాస్ట్. ఈజీ మెకానిజం. మిడిల్ క్లాస్ ఫామిలీ వాళ్ళు కూడా కొనుక్కోవచ్చు."

శ్రీనాథ్ మినీ జనరేటర్ గురించి వివరాలు చెప్పాడు. పదిలక్షలు వుంటే చాలు అన్నాడు.

రాజేంద్రప్రసాద్‌కి అతని ప్రతిపాదన నచ్చింది. నందితకూడా ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్ కాబట్టి ఇద్దరూ కలిసి సక్సెస్‌ఫుల్‌గా ఇండస్ట్రీ డెవలప్ చేస్తారని అతనికి నమ్మకం కలిగింది.

కిరణ్ తనకి బెస్టు ఫ్రెండ్ అని చెప్పాడు శ్రీనాథ్.

గంట తర్వాత కూల్‌డ్రింక్స్ మాత్రం తీసుకుని

బయల్దేరారు ముగ్గురూ.

రాజేంద్రప్రసాద్, దశరథ్ గేటువరకు వచ్చి సెండాఫ్ చెప్పారు.

నందిత కళ్ళతోనే వీడ్కోలు చెప్పింది శ్రీనాథ్‌కి.

సాయంకాలం మళ్ళీ కలుస్తానని చెప్పి వెళ్ళిపోయాడు వెంకటసుబ్బయ్య.

ఆ పూట అతను ఆఫీసుకు రాలేదు.

ఈవెనింగ్ వచ్చి కిరణ్‌ని తీసుకుని మౌంట్ రోడ్డుకి బయల్దేరదీశాడు వెంకటసుబ్బయ్య. పెళ్ళి కుదిరినందుకు ఆనందపడి గజేంద్రవిలాస్‌లో హాఫ్ బాటిల్ విస్కీ తాగి కక్కుకున్నాడు వెంకటసుబ్బయ్య.

29

శ్రీనాథ్, నందితల పెళ్ళయింది.

నెల తర్వాత హనీమూన్ నుంచి తిరిగివచ్చారు. వచ్చీ రాగానే కిరణ్ కోసం ఇంటికి వచ్చాడు శ్రీనాథ్.

"ఏమంటున్నది నందిత?" ప్రశ్నించింది విజయ.

"షీ ఈజ్ ఫైన్ గర్ల్" చెప్పాడు శ్రీనాథ్.

హనీమూన్ కబుర్లు చెప్పాడు చాలాసేపు. అతను చాలా సంతోషంగా వున్నాడు.

"పాత జీవితం అంతా పీడకలలా వుందిరా! ఇప్పుడు నేను స్వర్గంలో వున్నట్లు ఫీలవుతున్నాను. ఐ యామ్ వెరీ వెరీ హేపీ. ఇదంతా నీవల్లనేరా" అన్నాడు శ్రీనాథ్.

"ఇప్పుడు సుఖంగా వుందని పొంగిపోకు. ముందు ముందు కష్టాలు యెదురైనా ఎదుర్కొనే ధైర్యం సంపాదించుకోవాలి" అన్నాడు కిరణ్.

"కష్టాలు నాకు కొత్తకాదు."

"గుడ్. ముందే చెప్తున్నా నువ్విప్పుడు సొసైటీలో చాలా గొప్పవాడివి. నేను మీ మామగారి ఇండస్ట్రీలో చిన్న ఉద్యోగిని. కాబట్టి మనం దూరం దూరంగా వుండడం మంచిది. ముఖ్యంగా ఆఫీసులో నన్ను కలుసుకోవద్దు. ఎప్పుడైనా ఇంటికిరా" అన్నాడు కిరణ్.

శ్రీనాథ్ ఖిన్నుడయ్యాడు. ముఖం వెలవెలపోయింది.

"అవేం మాటల్రా! నేను యెంత గొప్పవాడినైనా అదంతా నీవల్లనే. మన ఫ్రెండ్‌షిప్‌కి అవేం అడ్డు రాకూడదు" అన్నాడు శ్రీనాథ్.

"డోంట్ టెల్ డ్రామా డైలాగ్స్. నేనేం చెప్పినా దానికి కొంత అర్ధం వుంటుందని గ్రహించు" అన్నాడు కిరణ్.

"ఏమోరా! నీ మాటలు నాకేం అర్ధంకావడం లేదు."

"అవే అర్ధమౌతాయిలే. ఇంకొక నెలరోజులు ఆగి నీ ప్లాన్ మీ మామగారి ముందు పెట్టు. ఏమంటాడో చూద్దాం" అన్నాడు కిరణ్.

శ్రీనాథ్ తల వూపాడు.

విజయ అతన్ని డిన్నర్‌కి వుండమన్నా నందిత ఎదురు చూస్తుందని వెళ్ళిపోయాడు.

"ఈసారి చాలా లేటవుతోంది కిరణ్" అంది విజయ అతని ప్రక్కనే కూర్చుంటూ.

"ఏం?"

"ఇంతవరకు కథ ముందుకు జరగడంలేదు రాజేంద్ర ప్రసాద్ విషయంలో."

"ఇదిగో ఇక మొదలవుతోంది చూడు."

"శ్రీనాథ్ గూడా అనుమానితుడేనా ! రాజేంద్ర ప్రసాద్ మర్డర్ జరిగాక."

"నీకా అనుమానం ఎందుకు?"

"ఇతను మీ క్లోజ్ ఫ్రెండ్ కదా!"

"అయితే ఏం?"

"అతనికి ఇచ్చింది కదా!"

"అంతేకదా! అతన్నేం ముద్దాయిని చెయ్యడంలేదు మనం. వాళ్ళ మామని మర్డర్ చెయ్యమని పంపడంలేదు. ముందెప్పుడో పోలీసులు అనుమానిస్తారు దట్సాల్."

"శ్రీనాథ్ ఏం ప్లాన్ వేస్తున్నాడు?"

"బిజినెస్. మినీ జనరేటర్స్ ఇక్కడే మాన్యుఫాక్చర్ చేసేందుకు ప్లాన్."

"ఇప్పుడు తేలిపోతుందన్నమాట శ్రీనాథ్ అమెరికా అల్లుడు కాదని."

"ఎలా తేలుతుంది?"

"అమెరికా తిరిగి వెళ్ళడానికి ప్రయత్నించడు కాబట్టి."

"దాండే వుంది? అమెరికాలో చదువుకున్నవాళ్ళు అక్కడే సెటిల్ అయిపోవాలా?"

"అతను సెటిల్ అవుతానని కోతలు కొయ్యబట్టేకదా పిల్లనిచ్చింది."

"కావచ్చు. అమ్మాయి కళ్ళముందే వుంటానంటే యే తండ్రి అయినా అభ్యంతరం చెప్పడు" అన్నాడు కిరణ్.

"ఇతనికి వాళ్ళ మామకి ఎలా చెడుతుంది? నాకు అర్థంకావడంలేదు" విజయ.

"ఇండియాలో సెటిల్ కావడానికి రాజేంద్రప్రసాద్ ఒప్పుకున్నా అతని బావమరిది దశరథ్ చస్తే ఒప్పుకోడు."

"ఏం?"

"ఎదురుగా అల్లుడు వుంటే బావమరదిమీద ఎవరికి ప్రేమ వుంటుంది?" అని నవ్వాడు కిరణ్.

అందులో వున్న లాజిక్ నెమ్మదిగా అర్థమౌతోంది విజయకి.

నెల గడిచిపోయింది.

తను ఇండియాలోనే ఇండస్ట్రీ స్టార్టు చేసే విషయం మామగారితో మాట్లాడే ముందు నందితకి కూడా చెప్పడం మంచిదని అనిపించింది శ్రీనాథ్‌కి. పెళ్ళయిన దగ్గర్నుంచి టెక్నికలర్ స్వప్నంలో విహరిస్తున్నట్లుగా వుంది ఆతనికి. అది ఎక్కడ జారిపోతుందోనని భయం పట్టుకుంది ఇప్పుడు. ఆ కల శాశ్వతం చేసుకోవాలని తాపత్రయ పడసాగాడు.

గోడమీద వున్న డిజిటల్ క్లాక్ పదకొండు గంటలు చూపుతోంది. ఎర్రటి అంకెలు త్వర త్వరగా మారి పోతున్నాయి. సిటిజన్ క్వార్ట్జ్ క్లాక్ పదకొండు గంటలు కొట్టింది.

టి.వి.లో 'బ్లూ లగూన్' వస్తోంది. బ్రూక్‌షీల్డ్స్ నగ్నంగా సముద్రపు ఇసకలో పరిగెత్తుతోంది.

ఏ.సి. సన్నగా చప్పుడు చేస్తోంది.

ఆలివ్ గ్రీన్ డిజైన్స్ వాల్ పేపరు షాండ్లియర్స్ వెలుగులో అద్భుతంగా కనిపిస్తోంది. ఆ గది అందాన్ని రెట్టింపు చేస్తోంది.

శ్రీనాథ్ డబుల్ కాట్ మీద పడుకుని టి.వి. చూస్తున్నాడుగాని అతని మనసు ఎక్కడో వుంది. నందితతో ఆ విషయం ఎలా మొదలుపెడితే బాగుంటుందో ఆలోచిస్తున్నాడు. ఆమె మనసు చాలా సున్నితంగా వుంటుం

దని సంగతి ఈ రెండు నెలల్లో బాగా అర్థం చేసుకున్నాడు.

నందిత సోఫాలో కూర్చుని ఛేజ్ నవలలో లీనమైంది. పుస్తకం మొదలుపెట్టిందంటే అది పూర్తయ్యేవరకూ ఆమె నిద్రపోదు.

ఆమె లైట్ కలర్ ఇంపోర్టెడ్ నైటీలో ఆకర్షణీయంగా కనిపిస్తోంది. తెల్లటి పాలరాతి విగ్రహం గుర్తొస్తోంది నందితను చూస్తూవుంటే.

శ్రీనాథ్ కళ్ళు మూసుకుని ఆలోచనలో వుండిపోయాడు. అరగంట తర్వాత నందిత లైట్లు ఆఫ్ చేసి, బెడ్‌లాంప్ ఆన్ చేసి వచ్చిన సంగతి అతను గమనించలేదు.

"డియర్!"

శ్రీనాథ్ చెవికి నందిత మృదువైన పెదవులు మెత్తగా తాకాయి. పట్టుకుచ్చు వంటి ఆమె జుట్టు ముఖంమీద గిలిగింతలు పెట్టింది.

"డార్లింగ్!"

శ్రీనాథ్ ఆమెను మీదికి లాక్కున్నాడు.

నందిత చేతులు అతన్ని పాముల్లా చుట్టుకున్నాయి.

అతని చేతులు ఆమె నైటీని నెమ్మదిగా తొలగించాయి. ఆమె అతని కౌగిలిలో కరిగిపోతూ వున్నది.

"డార్లింగ్!"

"ఓఁ...." మత్తుగా అంది నందిత. ఆమెకు నిత్యనూతనంగా వుంది ఆ అనుభవం. గాలిలో తేలిపోతున్నట్లుగా, శరీరం కరిగిపోతున్నట్లుగా వుంది.

"నందితా, మనం త్వరలో విడిపోతున్నాం" అన్నాడు శ్రీనాథ్.

ఆమె ఉలిక్కిపడింది.

"ఇంపాజిబుల్" గట్టిగా అరిచింది.

"ఒక వారంలో న్యూమెక్సికో వెళ్తున్నాను."

"ఏం?"

"ఎన్నాళ్ళు మామగారింట్లో వుండాలి? యేదోక మార్గం చూసుకోవాలి గదా! అమెరికాలో మినీ జనరేటర్ ఇండస్ట్రీ స్టార్ట్ చెయ్యాలి. ఇక్కడ్డా అక్కడ అంచాలిస్తే లైసెన్సులు రావు. అంతా రూల్ ప్రకారం చేస్తారు. కనీసం సంవత్సరమైనా పడుతుంది. అన్నాళ్ళూ నేను అక్కడ మా అంకుల్ ఇంట్లో వుండి పనులు చూసుకుంటాను. నువ్వు ఇక్కడ వుండు. ఏం?"

"నో...."

"ఏమిటి 'నో'?"

"నేనిక్కడ ఒంటరిగా వుండడం."

"మరెలా?"

"నేనూ వస్తాను."

"ఎలా కుదురుతుంది? నేను పగలంతా యెక్కడెక్కడో తిరుగుతుంటాను, పనులమీద న్యూయార్క్ వెళుతుంటాను. నీకు బోర్‌గా వుంటుంది. అదీగాక సంపాదన లేకుండా ఫ్యామిలీ మెయింటైన్ చెయ్యడం కష్టం. ఇండస్ట్రీ మొదలైన తర్వాత నిన్ను తీసుకెళ్తాను. ఏం?"

"ఆ ఇండస్ట్రీ యేదో ఇక్కడ పెట్టకూడదా? మద్రాస్‌లో యెన్నో ఇండస్ట్రీస్ వున్నాయే" అంది నందిత.

శ్రీనాథ్ ఐడియా ఫలించింది.

"నిన్ను వదిలి ఎలా వుండడమా అని లోలోపల యెంత మధనపడుతున్నానో నీకు అర్థంకాదు. నీ సలహా

అద్భుతంగా వుంది నందితా? థాంక్స్! థాంక్యూ—"

అతను నందితను ఆవేశంతో హత్తుకున్నాడు. ముద్దుల వర్షం కురిపించి ఆమెను వుక్కిరిబిక్కిరి చేశాడు.

నందితకు అతని ఆవేశం యెంతో హాయిగా వుంది. మైమరపుతో ఆమె కళ్ళు మూతలు పడుతున్నాయి.

"మీ నాన్న యేమంటాడో నందితా?"

"ఆయన యేమంటాడు? 'యస్' అంటాడు" నవ్వింది నందిత.

"కాని నాకు మామగారింట్లో పర్మనెంటుగా వుండి పోవడం ఇష్టంలేదు."

"ఏం? ఆయనకి మాత్రం ఎవరున్నారు? నేనుగూడా యింట్లోంచి వెళ్ళిపోతే ఆయన మరీ ఒంటరివాడయి పోడూ!"

నందిత మనసు శ్రీనాథ్‌కి అర్థమైంది.

మర్నాడు శ్రీనాథ్, నందిత కలిసి రాజేంద్రప్రసాద్ దగ్గరికి వెళ్ళారు. ఇద్దరూ ఒకేసారి రావడంతో యేదో విశేషం వుందని అతను అనుకున్నాడు.

"రండి....రండి...." అని సోఫా చూపించాడు.

ఇద్దరూ కూర్చున్నారు.

"నాన్నా! ఆయన మినీ జనరేటర్ ఇండస్ట్రీ యిక్కడే పెట్టాలనుకుంటూన్నారు" అంది నందిత.

"నేను కాదండీ! మీ అమ్మాయి సలహా" అని నవ్వాడు శ్రీనాథ్.

"అవును. ఇండస్ట్రీ యెక్కడైతేనేం?" అంది.

రాజేంద్రప్రసాద్ తల వూపాడు.

"ఏమంటావు నాన్నా!"

"నాకేం అభ్యంతరం లేదు. ఇక్కడే అయితే యే

ఇబ్బంది లేదు. మన డిస్ట్రిబ్యూటర్స్ వున్నారు. డిపా జిట్స్ కలెక్ట్ చెయ్యొచ్చు. నో ప్రాబ్లమ్" అన్నాడు రాజేంద్రప్రసాద్.

ఇంతలో రూమ్‌లోకి దశరథ్ ప్రవేశించాడు.

"ఏమిటి ప్రొద్దున్నే సీరియస్‌గా డిస్కస్ చేస్తున్నారు?" అన్నాడు.

రాజేంద్రప్రసాద్ చెప్పాడు.

అదంతా విని దశరథ్ ముఖంలో రంగులు మారాయి. రాజేంద్రప్రసాద్ అల్లుళ్ళిద్దరూ మద్రాస్‌లో వుండడం అతనికి యిష్టం వుండదు. దానికి చాలా కారణా లున్నాయి.

పెద్దలుడు డాక్టర్, చిన్నల్లుడు పైలెట్ సంబంధాలు సెలక్ట్ చేసింది గూడా అతనే. కాని మూడో అల్లుడితో చిక్కొచ్చింది. ఇతను మెకానికల్ ఇంజనీర్. అమెరికా వెళ్ళిపోతాడనే ఆలోచనతో ఒప్పుకున్నాడు గాని లేక పోతే ఏదో అడ్డుపుల్ల వేసేవాడే. అయితే దశరథ్ చాలా తెలివయిన ఘటం.

"అయితే మీరు ఇక్కడే ఇండస్ట్రీ స్టార్ట్ చేద్దామను కుంటున్నా రన్నమాట" అన్నాడు దశరథ్, శ్రీనాథ్‌తో.

"యస్ అంకుల్, నండిర ఐడియా! నాకయితే అమెరికా వెళ్ళాలనే వుంది" అన్నాడు శ్రీనాథ్.

"అమెరికా ఎందుకు వెళ్తావు మిస్టర్ శ్రీనాథ్? వెళ్ళవని నాకు తెలుసు. వెళ్ళలేవని గూడా తెలుసు" సీరియస్‌గా అన్నాడు దశరథ్.

శ్రీనాథ్ కంగారుపడ్డాడు.

"ఏమిటి అంకుల్ మీరంటున్నది?" అన్నాడు.

నందిత, రాజేంద్రప్రసాద్ అయోమయంగా ముఖాలు చూసుకున్నారు.

శ్రీనాథ్ ముఖం కళ తప్పింది. తన రంగు దశరథ్ కి తెలిసిపోయిందేమో అని అనుమానం లీలగా మనసులో మెదిలింది.

"నువ్వసలు అమెరికా ముఖం చూళ్ళేదు. అక్కడ చదవలేదు. వరంగల్ లో ఇంజనీరింగ్ చదివావు" అన్నాడు దశరథ్.

శ్రీనాథ్ నెత్తిన బాంబ్ ప్రేలింది.

"నో...." అన్నాడు గట్టిగా.

"యస్ మిస్టర్ శ్రీనాథ్. నువ్వు హానీమూన్ వెళ్ళినప్పుడు మీ పెద్దన్న వచ్చి నన్ను కలిశాడు. పేపర్లో మీ పెళ్ళి ఫోటో చూశాడట. పెళ్ళికి వాళ్ళెవర్నీ పిలవలేదని బాధ పడ్డాడు" చెప్పాడు దశరథ్.

రాజేంద్రప్రసాద్ బిత్తరపోయి విన్నాడు.

నందిత ముఖం కోపంతోను, అవమానంతోను ఎర్రబడిపోయింది. ఆమె కళ్ళు పెద్దవిచేసి "యూ! చీట్" అని కేకపెట్టింది.

చరచర వెళ్ళిపోయింది.

"నందితా!" అంటూ శ్రీనాథ్ ఆమె వెంటవెళ్ళాడు.

నందిత ఏడుస్తూ సోఫాలో కూలబడింది.

శ్రీనాథ్ ఆమె దగ్గరగా వెళ్ళి "ప్లీజ్ నందితా! చెప్పింది విను" అంటూ ఆమె మీద చెయ్యి వేశాడు.

అతని చేతిని విసిరికొట్టి "ఐ హేట్ యూ! గెటౌట్" అంది.

శ్రీనాథ్ బిత్తరపోయాడు.

"మోసగాళ్ళంటే నాకు అసహ్యం. ఛీ....నీ ముఖం

నాకు చూపించకు" అని గట్టిగా అరిచింది.

నాకర్లు చూస్తున్నారు ఆ సీన్. అతనికి తల కొట్టేసి నట్లనిపించింది. నందిత కోపంతో వుంది. హర్ట్ అయింది. ఇప్పుడు పలకరించి లాభం లేదు. కోపం తగ్గనీ అను కుంటూ అతను వెళ్ళిపోయాడు.

రాజేంద్రప్రసాద్ ఆ షాక్ నుంచి ఇంకా తేరుకో లేదు. కారు డ్రైవ్ చేసుకుంటూ వెళుతున్న శ్రీనాథ్‌ని చూస్తూ నిశ్శబ్దంగా వుండిపోయాడు. దశరథ్ చెప్తున్న మాటలు అతని చెవికి ఎక్కడం లేదు.

శ్రీనాథ్ సరాసరి తన ఫ్లాట్‌కి వెళ్ళిపోయాడు.

ప్రసాద్ ఇండస్ట్రీకి ఫోన్ చేశాడు కిరణ్ కోసం. అతను జాబ్ మానేసి నెల రోజులు కావొచ్చిందని చెప్పారు. ఇంటికి ఫోన్ చేశాడు. కిరణ్ పలికాడు.

"నేను శ్రీనాథ్‌ని మాట్లాడుతున్నాను."

"ఏరా! ఏమిటి సంగతి?"

"అంతా అప్‌సెట్ అయిపోయిందిరా!"

"ఏమిటో జరిగింది చెప్పు."

"నేను అమెరికాలో చదవలేదని, అక్కడ నా అంకుల్ ఎవరూ లేడని, నేను వరంగల్‌లో చదివానని తెలిసిపోయింది. దశరథ్ అంతా చెప్పేశాడు. హేం త్సీమూన్‌లో వున్నప్పుడు మా పెద్దన్నయ్య వచ్చాడట."

"అలాగా! సో వాట్?" అన్నాడు కిరణ్.

"ఇప్పుడేం చెయ్యాలి? నందిత నన్ను గెటౌట్ అంది."

"డోంట్ వర్రీ. కొన్నాళ్ళు పోతే తనే సర్దుకుం టుంది. హిందూదేశపు స్త్రీ కదా! పతియే ప్రత్యక్ష దైవం అని నీ దగ్గరికి రాక తప్పదు."

"నీకు ఎగతాళిగా వుందా! నేను కొంప మునిగి చస్తుంటే?"

"నీ కొంప ఏం మునగలేదు. మునిగింది మీ మామ."

"అది సరే! ఇప్పుడు నేనేం చెయ్యాలి?"

"ఏమీ చెయ్యొద్దు. హాయిగా తిని పడుకో. రేపొద్దున ఇక్కడికి వచ్చెయ్ మాట్లాడుకుందాం. డోంట్ వర్రీ" అన్నాడు కిరణ్.

"ఈ రాస్కెల్ వల్లనే ఈ గొడవంతా వచ్చింది" అనుకుని తిట్టుకుంటూ ఫోన్ విసురుగా పడేశాడు శ్రీనాథ్.

30

"ఏమంటున్నది నందిని?" నవ్వుతూ అడిగాడు కిరణ్.

శ్రీనాథ్‌కి మండిపోయింది.

"నాకు విడాకులు ఇస్తానంటోంది."

"అదంత తేలిక కాదులే."

"ఏం?"

"నువ్వు ఒప్పుకోవుగా. అదీగాక ఇద్దరూ విడివిడిగా రెండేళ్ళున్నట్లు నిరూపించుకోవాలి. మీ పెళ్ళయి రెండు నెలలేగా!"

"ఇదంతా ఆ దశరథ్ గాడివల్ల జరిగింది" కోపంగా అన్నాడు శ్రీనాథ్.

"దశరథ్ మీద నీకు పగ తీర్చుకోవాలని వుందా?"

"ఎలా?"

"నిన్ను ఆ ఇంట్లోంచి నెట్టేశాడు. నువ్వు వాడిని మెడపట్టి గెంటేటట్లు చెయ్యాలి."

"ఎలా?"

"చెప్తాను. మీ మామ పర్సనల్ నెంబర్ నీకు

తెలుసా?"

"తెలుసు."

"అయితే రింగ్ చెయ్యి."

శ్రీనాథ్ రిసీవర్ ఎత్తి రింగ్ చేశాడు.

"రాజేంద్రప్రసాద్ హియర్" లైన్లోకి వచ్చాడు.

"హల్లో హల్లో....ప్రసాద్ ఇండస్ట్రీస్ ప్రొప్రయిటర్ గారేనా?"

"అవును."

"మీరు రాజేంద్రప్రసాదేనా!"

"అవునయ్యా బాబు! మీరెవరు?"

"నా పేరు జగదీష్ సార్! నీలిమ ఎంటర్ప్రైజెస్ ప్రొప్రయిటర్ని. నెల్లూరు నుంచి యస్. టి. డి.లో మాట్లాడుతున్నా."

"చెప్పండి."

"నేను నెల్లూరులో మీ ప్రొడక్ట్స్కి డిస్ట్రిబ్యూటర్ని."

"అలాగా! చెప్పండి ఏం కావాలి? ఏదయినా ఆర్డర్ చెప్తారా?"

"ఆ విషయమే మీకు చెప్పాలని ఫోన్ చేస్తున్నా. దాదాపు ఆర్నెల్ల నుంచి మీ కంపెనీ సరుకు సరిగ్గా మూవ్ కావడం లేదు."

"వాట్?"

"అవున్సార్! గ్యారంటీ పిరియడ్ యెంత ఇస్తున్నా లాభంలేకపోతోంది. నేనిక్కడ ఎంక్వయిరీ చేశాను. మన కంపెనీసరుకు చాలా చౌకగా వేరేకొన్ని షాప్స్లో అమ్ముతున్నట్లు తెలిసింది. సీలింగ్ ఫాన్ ఆరొందలది, మూడొందలకి, మిక్సీలు పద్నాలుగు వందలది, ఎనిమిది వందలకు అమ్ముతున్నారు."

"ఎలా అమ్ముతున్నారు? వాళ్ళకి అంత చౌకగా ఎలా వస్తోంది సరుకు?

"మీరు చెప్తే నమ్ముతారో లేదో, మీ ఇండస్ట్రీలో మీకు నమ్మకమైనవాళ్ళే డూప్లికేట్ సరుకు తయారు చేయించి అమ్ముతున్నారు. అదంతా మద్రాసులోనే తయారవుతోంది."

"ఈజిట్?"

"యస్సార్! ఆ అడ్రస్ గూడా నాకు తెలుసు. ఎన్నూర్‌లో సరుకు తయారవుతుంది. వాటిని మార్కెట్ చేసే వ్యక్తి పేరు దశరథ్."

"వాట్? దశరథ్."

"యస్! దశరథ్. అతను లేకపోతే అతని బావమరది హరిహరదాసు గాని సరుకు మార్కెట్ చేస్తారు."

"వండర్‌ఫుల్‌గా వుందే."

"మీరు వెంటనే మీ కంపెనీ మేనేజర్స్‌కి గూడా తెలియకుండా పోలీస్ కంప్లెయింటు ఇచ్చి వెంటనే పట్టుకోండి. లేకపోతే మేం మీ కంపెనీసరుకు అమ్మలేం. ప్రజలకి తెలీదు గదా యేది అసలో, యేది నకిలీనో."

"అవును జగదీష్‌గారూ! నేను వెంటనే వాళ్ళని పట్టుకుంటాను. వీలైతే మీరు గూడా అక్కడ పోలీస్ కంప్లెయింటు ఇవ్వండి."

"అలాగే సార్!"

"థాంక్యూ! జగదీష్!"

"నో మెన్షన్ సార్!"

కిరణ్ ఫోన్ పెట్టేశాడు.

శ్రీనాథ్ వాళ్ళ సంభాషణ ఆశ్చర్యంగా వింటున్నాడు.

"ఏమిట్రా మొఖం అలా పెట్టావ్?" నవ్వుతూ అడిగాడు కిరణ్.

"నువ్వు చెప్పేదంతా!"

"హండ్రెడ్ పర్సెంట్ కరెక్ట్."

"ఎలా తెలుసుకున్నావు?"

"అదంతా అడక్కు. రేపు పేపర్లో పడుతుంది ఈ వార్త చదువుకో" అన్నాడు కిరణ్.

మర్నాడు పేపర్లో ప్రముఖంగా పడింది. 'నకిలీ కంపెనీ పట్టివేత' అనే హెడ్డింగుతో.

'గత పదిహేనుసంవత్సరాలుగా ప్రసాద్ ఇండస్ట్రీస్ తయారుచేసే వస్తువులకు మార్కెట్లో పేరు ప్రఖ్యాతులు వున్న సంగతి పాఠకులకు తెలిసిందే. ప్రసాద్ ఇండస్ట్రీస్ పేరుతో నకిలీ వస్తువులు తయారుచేసి మార్కెట్టు చేసి చౌకగా ప్రజలకు అందిస్తున్న హరిహరదాస్ అనే వ్యక్తిని పోలీసులు నిన్న ఎన్నూరులో అరెస్టు చేశారు. అప్పుడు అతనికి నకిలీ ఫాక్టరీలో ఇరవై వేల ఫ్యాన్‌లు, మిక్సీలు, వగైరా వస్తువులు దొరికాయి. పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరుకు చెందిన నీలిమ ఎంటర్‌ప్రైజెస్ ప్రొప్రయిటర్ శ్రీ జగదీష్ ఫోన్ చేసి తనకీ విషయం తెలియచేశాగని ప్రసాద్ ఎంటర్‌ప్రైజెస్ ప్రొప్రయిటర్ శ్రీ రాజేంద్రప్రసాద్ విలేఖరులకు చెప్పారు. తను మొదట ఆశ్చర్యపోయాననీ, నమ్మలేకపోయాననీ ఆయన తెలియజేశారు. వెంటనే పోలీసులకు కంప్లెయింటు ఇచ్చాననీ వారు నకిలీ ఫ్యాక్టరీని స్వాధీనపరుచుకున్నారనీ అన్నారు. ఇంకొక గమ్మత్తయిన విషయం యేమిటంటే ప్రసాద్ ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్ శ్రీ దశరథ్ హస్తం నకిలీ ఫ్యాక్టరీలో

వుండడం. శ్రీహరిహరదాస్, దశరథ్ బాతమరది అని తెలిసింది. ప్రసాద్ ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్ దశరథ్, ప్రొప్రయిటర్ శ్రీరాజేంద్రప్రసాద్‌కి స్వయాన బావమరది. శ్రీదశరథ్ పరారీలో వున్నట్లు తెలిసింది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీ పళనిస్వామి కేసు దర్యాప్తు చేస్తున్నారు.'

శ్రీనాథ్ వెళ్ళేసరికే కిరణ్, విజయ పేపర్లు చూస్తున్నారు. కొన్ని డెయిలీలలో ఫొటోలు ప్రచురించారు. హరిహరదాస్ సంకెళ్ళతో ఫ్యాన్లు, మిక్సీల వెనుక నిల్చుని వున్నాడు.

"రా....రా....నీ కోసమే చూస్తున్నాం" అన్నాడు కిరణ్.

"నిన్న నువ్వు చెప్పింది నమ్మలేకపోయాను. ఈ రోజు పేపర్లో చూసి థండర్ అయ్యాను. ఎంత గమ్మత్తుగా మోసం చేశాడు దశరథ్!" అన్నాడు శ్రీనాథ్.

"ఇప్పుడు తెలిసిందా దశరథ్ నీ గుట్టు ఎందుకు బైట పెట్టాడో?" అడిగాడు కిరణ్.

"నేనుంటే ఇది ఎప్పుడో ఒకప్పుడు బయటపడుతుందని భయపడుంటాడు. అదీగాక ఇండస్ట్రీలో అల్లుడుగా నేను అతన్ని డామినేట్ చేస్తానేమోనని సంశయం కూడా వుండివుంటుంది."

"నువ్వు అమెరికా వెళ్ళడానికి సిధ్ధపడి వుంటే అతను నీ గుట్టు బైటపెట్టేవాడు కాదు" అన్నాడు కిరణ్.

"అవును."

"నందితను మళ్ళీ కలిశావా?"

"లేదు."

"ఏం?"

"లాభం లేదు. నామీద ఇంకా కోపం పోలేదు."

"ఎలా తెలుసు నీకు?"

"నన్ను చూస్తూనే ముఖం చిట్లించుకుని లోపలికి వెళ్ళిపోయింది.

"ఓరి పిచ్చివాడా! ఆడదాని సంగతి నీకు సరిగా తెలీదు. 'అవునంటే కాదనీ, కాదంటే అవుననీ' సినిమా కవి చెప్పాడు నీకు తెలుసో. లేదో వెళ్ళు.... వెళ్ళి మొదట బ్రతిమాలు. లేదంటే మన ఫ్లాట్‌కి వెడదాం రమ్మని బెదిరించు. గట్టిగా అరువు. ఇరుగు పొరుగు వింటారేమో పరువు పోతుందని మీ మామ నందితకు సర్ది చెప్తాడు."

"అంతేనంటావా?"

"అంతే. లేకపోతే ఎన్నాళ్ళున్నా నీ ప్రాబ్లమ్ సాల్వ్‌కాదు."

శ్రీనాథ్‌కి నందితతో గడిపిన మధుర క్షణాలు గుర్తొస్తుంటే పిచ్చెక్కిపోయింది. ఆమె తోడు లేకుండా జీవించడం వృధా అనిపించింది. నందిత పొందుకోసం యేమైనా చెయ్యడానికి, ఆఖరికి నందిత కాళ్ళు పట్టుకునయినా.... బ్రతిమాలాలనిపించింది. ఆమెను ప్రసన్నం చేసుకోవాలనే దృఢ నిశ్చయంతో వెళ్ళాడు.

కారు దిగి లోపలకు వస్తున్న అల్లుడ్ని చూసి రాజేంద్ర ప్రసాద్ ముఖం చిట్లించుకున్నాడు. పలకరించలేదు. చూసీ చూడనట్లు తన రూమ్‌లోకి వెళ్ళిపోయాడు.

శ్రీనాథ్ మనస్సు చివుక్కుమంది.

'పలకరిస్తే పీడిసామ్మేం పోయిందో' అనుకున్నాడు.

నందిత బెడ్‌రూమ్ తీసే వుంది.

పిల్లిలా లోపలకు ప్రవేశించాడు.

నందిత డ్రెస్సింగ్ మిర్రర్ ముందు నిల్చుని తల దువ్వ

ఉంటోంది. షాంపూ చేసుకున్న జుట్టు గాలికి రెపరెప ఎగురుతున్నాయి. ఆమె నుంచి ఇంపోర్టెడ్ మిక్స్ పరిమళం ముక్కులకు తగిలింది. గ్రీన్ కలర్ గార్డెన్ చీరలో నందిత అప్సరసలా మెరిసిపోతోంది. తల దువ్వుకుంటున్నప్పుడు చేతులు పైకి ఎత్తుతుంటే ఆమె గుండె కదులుతూ అతనికి వెర్రెక్కించేస్తోంది. ఆమె రెండు మూడు సార్లు పయిట సర్దుకుంది. ఎత్తుగా కనపించిన స్తనద్వయం కళ్ళంతా కళ్ళు చేసుకుని చూశాడు. కదిలితే ఎక్కడ కల చెదిరిపోతుందోనని నిశ్శబ్దంగా నిల్చున్నాడు.

నందిని గిర్రున వెనక్కి తిరిగింది.

శ్రీనాథ్ నిల్చుని వున్నాడు దోషిలా.

ఆమె ముఖం ఎర్రపడింది కోపంతో.

"నందితా."

ఆమె పలుక లేదు.

"నందితా ప్లీజ్ మాట్లాడు."

"........ ...."

"డార్లింగ్! నేను కావాలని నిన్ను మోసం చెయ్యలేదు."

"చూడు కావాలని చేసినా, కావాలని చెయ్యక పోయినా మోసం మోసమే. గుర్తుంచుకో! మళ్ళీ ఎందుకు వచ్చావిక్కడికి?" తీవ్రంగా వుంది ఆమె స్వరం.

అతను గతుక్కుమన్నాడు.

"నా మీద కోపం తగ్గలేదనుకుంటాను."

"అది ఎప్పటికీ తగ్గదు."

"ప్లీజ్ అలా అనకు డార్లింగ్! ఎంత కాదనుకున్నా నేను నీ భర్తని. కొన్నాళ్ళు కాపురం చేశాం"

(ఇంకా వుంది)